జైస్వాల్ ధమాకా

సూపర్ సెంచరీతో విజృంభణ • భారత్ రెండో ఇన్నింగ్స్ 196/2

322 పరుగుల భారీ ఆధిక్యం • సిరాజ్ తడాఖా • ఇంగ్లండ్ 319 ఆలౌట్

రాజ్‌కోట్ టెస్టుపై భారత్ మరింత పట్టుబిగిస్తున్నది. ఇంగ్లండ్ బజ్‌బాల్ వ్యూహాన్ని అంతే దీటుగా తిప్పికొడుతూ భారీ ఆధిక్యం దిశగా దూసుకెళుతున్నది. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ సూపర్ సెంచరీతో కదంతొక్కిన వేళ టీమ్‌ఇండియా పటిష్ఠ స్థితిలో నిలిచింది. ఇంగ్లండ్ బౌలింగ్ దాడిని తుత్తునియలు చేస్తూ జైస్వాల్ శతకనాదం పూరించాడు. భారత భవిష్యత్ ఆశాకిరణంలా విమర్శకుల ప్రశంసలు అందుకుంటూ దూసుకెళుతున్నాడు. హైదరాబాదీ స్పీడ్‌స్టర్ సిరాజ్ నాలుగు వికెట్ల విజృంభణతో ఇంగ్లండ్ బ్యాటింగ్ నడ్డివిరిచాడు. 95 పరుగుల తేడాతో ఆఖరి ఎనిమిది వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్ మంచి అవకాశాన్ని చేజార్చుకుంది.

జైస్వాల్(104 రిటైర్డ్‌హర్ట్)

సిరాజ్(4/84)

రాజ్‌కోట్: భారత్, ఇంగ్లండ్ మధ్య మూడో టెస్టు ఆసక్తికరంగా సాగుతున్నది. అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో రాణిస్తూ ప్రత్యర్థిపై పైచేయి సాధిస్తున్నది. ఓపెనర్ యశస్వి జైస్వాల్(133 బంతుల్లో 104 రిటైర్డ్ హర్ట్, 9ఫోర్లు, 5 సిక్స్‌లు) అద్భుత సెంచరీతో అదరగొట్టగా, గిల్(65 నాటౌట్) అజేయ అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. వీరిద్దరి రాణింపుతో రెండో ఇన్నింగ్స్‌లో భారత్ రెండు వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసింది. రజత్ పాటిదార్(0)మరోమారు తీవ్రంగా నిరాశపర్చగా, గిల్, కుల్దీప్‌యాదవ్(3) క్రీజులో ఉన్నారు. రూట్, హార్ట్‌లే ఒక్కో వికెట్ తీశారు. చేతిలో ఎనిమిది వికెట్లు ఉన్న భారత్ ప్రస్తుతం 322 పరుగుల భారీ ఆధిక్యంలో కొనసాగుతున్నది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 207/2 మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 319 పరుగులకు ఆలౌటైంది. డకెట్(153) ఒక్కడే రాణించగా, కెప్టెన్ స్టోక్స్(41) ఫర్వాలేదనిపించాడు. సిరాజ్(4/84) ఇంగ్లండ్ పతనాన్ని శాసించగా, కుల్దీప్‌యాదవ్(2/77), జడేజా(2/51) రెండేసి వికెట్లు తీశారు.

జైస్వాల్ జోరు:

ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో జైస్వాల్ శతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. విశాఖ టెస్టులో డబుల్ సెంచరీతో కదంతొక్కిన ఈ ముంబైకర్..రాజ్‌కోట్‌లో వీరవిహారం చేశాడు. ఇంగ్లిష్ బౌలింగ్ దాడిని దీటుగా తిప్పికొడుతూ కెరీర్‌లో ముచ్చటగా మూడో సెంచరీని తన ఖాతాలో వేసుకున్నాడు. కెప్టెన్ రోహిత్ శర్మ(19) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా..ఆత్మవిశ్వాసం కోల్పోని జైస్వాల్..ఇన్నింగ్స్ బాధ్యతను భుజాన వేసుకున్నాడు. గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఆదిలో కుదురుకునేందుకు సమయం తీసుకున్న జైస్వాల్ ఆ తర్వాత జూలు విదిల్చాడు. ఇంగ్లండ్ బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తూ మైదానం నలువైపులా ఫోర్లు, సిక్స్‌లతో అభిమానులను అలరించాడు. ఈ క్రమంలో ఇప్పటి వరకు ఆడిన ఏడు టెస్టుల్లోనే మూడో శతకాన్ని తన ఖాతాలో వేసుకుని దిగ్గజాల ప్రశంసలు అందుకున్నాడు. ఇన్నింగ్స్ ముగుస్తుందన్న తరుణంలో భరించలేని నడుం నొప్పితో జైస్వాల్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. దీంతో రెండో వికెట్‌కు 155 పరుగుల అజేయ భాగస్వామ్యానికి ఒకింత బ్రేక్ పడింది. ఆ తర్వాత క్రీజులో కొచ్చిన రజత్ పాటిదార్ పరుగులేమి చేయకుండానే డకౌట్‌గా వెనుదిరిగాడు. తొలి ఇన్నింగ్స్‌లో నిరాశపరిచిన గిల్..మలి ఇన్నింగ్స్‌లో విలువ చాటుకున్నాడు. జైస్వాల్‌తో కలిసి కీలక ఇన్నింగ్స్‌కు తెరతీశాడు. ఎక్కడా చెత్త షాట్‌కు పోకుండా బాధ్యతాయుతంగా ఆడాడు. కుల్దీప్‌యాదవ్‌తో కలిసి గిల్ మూడో రోజు ఆటను ముగించాడు.

సిరాజ్ విజృంభణ:

సీనియర్ స్పిన్నర్ అశ్విన్ లేని లోటును భారత బౌలర్లు ఏ మాత్రం కనిపించకుండా బౌలింగ్ చేశారు. ముఖ్యంగా స్వింగ్‌స్టర్ సిరాజ్..ఇంగ్లండ్ పతనంలో కీలకమయ్యాడు. 224/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్..సిరాజ్ విజృంభణతో 319 పరుగులకు పరిమితమైంది. సెంచరీ హీరో డకెట్‌ను కుల్దీప్ యాదవ్ బోల్తా కొట్టించగా, మిగతా పనిని జడేజాతో కలిసి సిరాజ్ పూర్తి చేశాడు. రూట్(18)ను మరోమారు బుమ్రా తన ఖాతాలో వేసుకోగా, బెయిర్‌స్టో(0)ను కుల్దీప్ డకౌట్ చేశాడు. సూపర్ యార్కర్లతో సిరాజ్..ఇంగ్లండ్ లోయార్డర్ పనిపట్టాడు. మొత్తంగా 95 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చివరి ఎనిమిది వికెట్లు కోల్పోయి మూడో టెస్టుపై పట్టు కోల్పోయింది. ఆదివారం ఆటలో భారత్‌ను ఎలా నిలువరిస్తుంది అన్న దానిపై ఇంగ్లండ్ విజయ అవకాశాలు ఆధారపడి ఉన్నాయి.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 445 ఆలౌట్, **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 319 ఆలౌట్, **భారత్ రెండో ఇన్నింగ్స్:** 196/2(జైస్వాల్ 104, గిల్ 65 నాటౌట్, రూట్ 1/48)

అశ్విన్ అమ్మకు అనారోగ్యం

భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తల్లి అనారోగ్యానికి గురైంది. ప్రస్తుతం ఆమె చెన్నైలో చికిత్స తీసుకుంటున్నట్లు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. 'అశ్విన్ తల్లి త్వరగా కోలుకోవాలని, ఇలాంటి క్లిష్ట సమయంలో అతనికి బోర్డు అన్ని విధాలుగా అండగా ఉంటుంది' అని బీసీసీఐ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. టెస్టు క్రికెట్‌లో ఐదు వందల వికెట్ల మైలురాయిని అందుకున్న అశ్విన్ హుటాహుటిన రాజ్‌కోట్ నుంచి చెన్నై బయల్దేరి వెళ్లాడు. కుటుంబంలో హెల్త్ ఎమర్జెన్సీ కారణంగా అశ్విన్ వెళ్లాల్సి వచ్చిందని బోర్డు ఒక ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే.

నల్ల రిబ్బన్లతో

మూడో టెస్టు మూడో రోజు ఆటలో భారత క్రికెటర్లు నల్లరిబ్బన్లు ధరించి బరిలోకి దిగారు. క్రికెట్ కురువృద్ధుడు దత్తాజీరావు గైక్వాడ్ మృతికి సంతాపంగా క్రికెటర్లు నల్ల రిబ్బన్లు ధరించారు. అయితే ఆట తొలి రోజే చేయాల్సిందని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డాడు.

భారత్ కొత్త చరిత్ర

- అదరగొట్టిన గాయత్రి, త్రిసా
- తొలిసారి ఫైనల్లో మహిళల టీమ్
- ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ టోర్నీ

షా ఆలమ్(మలేషియా): ప్రతిష్ఠాత్మక ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత అమ్మాయిల కొత్త చరిత్ర లిఖించారు. టోర్నీలో తొలిసారి ఫైనల్ పోరుకు అర్హత సాధించి ఔరా అనిపించారు. శనివారం జరిగిన సెమీస్‌లో మన అమ్మాయిల జట్టు 3-2తో రెండు సార్లు చాంపియన్ జపాన్‌పై చిరస్మరణీయ విజయం సాధించింది. సెమీస్ విషయానికొస్తే..తొలుత జరిగిన సింగిల్స్‌లో పీవీ సింధు 13-21, 20-22తో అయా ఒహోరీ చేతిలో ఓటమిపాలైంది. ఆ తర్వాత డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్, త్రిసాజాలీ జోడీ 21-17,16-21, 22-20తో ప్రపంచ ఆరో ర్యాంక్ ద్వయం నమి మత్సుయమ, చిహారు షిదాపై సంచలన విజయం సాధించింది. తమ(23వ ర్యాంక్) కంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న వారిని గాయత్రి, త్రిసా మట్టికరిపించారు. మరో సింగిల్స్‌లో అశ్మిత 21-17, 21-14తో నజోమి ఒకుహరపై గెలువడంతో భారత్ 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది. డబుల్స్‌లో సింధు, అశ్విని ద్వయం 14-21, 11-21తో రీనా మియురా, అయాకో సకురామోటో జోడీ చేతిలో ఓడటంతో స్కోరు 2-2తో సమమైంది. సింగిల్స్‌లో అన్మోల్ 21-14, 21-18తో నత్సుకిపై గెలిచి భారత్‌ను ఫైనల్ చేర్చడంలో కీలకమైంది.

రంజీ ట్రోఫీలో గణేశ్

హైదరాబాద్‌కు ఎంపికైన పాలమూరు ప్లేయర్

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 17: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన గణేశ్..రంజీ ట్రోఫీకి ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి రాజశేఖర్ శనివారం పేర్కొన్నాడు. ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియం వేదికగా జరుగుతున్న రంజీ ప్లేట్ డివిజన్ ఫైనల్లో హైదరాబాద్ తరపున గణేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. గత సీజన్‌లో మహబూబ్‌నగర్ జిల్లాకు ఆడిన గణేశ్ (137, 73, 49, 91) మొత్తంగా 350 పరుగులతో సత్తాచాటాడు. ఇప్పటి వరకు పాలమూరు నుంచి గౌస్‌బాబా ఒక్కడే ఎంపిక కాగా, 25 ఏండ్ల తర్వాత గణేశ్‌కు చోటు దక్కింది. హెచ్‌సీఏ టోర్నీలో ట్రిపుల్, డబుల్ సెంచరీలు చేసిన ఘనత ఇక్కడికి దక్కింది. రంజీ జట్టుకు ఎంపికపై ఎండీసీఏ కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షుడు సురేశ్, అశోక్, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, కృష్ణమూర్తి అభినందించారు.

జ్యోతి రికార్డు పసిడి

ఏషియన్ ఇండోర్ అథ్లెటిక్స్



టెహ్రాన్: భారత స్టార్ అథ్లెట్ యర్రాజీ జ్యోతి మళ్లీ మెరిసింది. తన పరుగుకు తిరుగులేదని నిరూపిస్తూ ఏషియన్ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటింది. శనివారం జరిగిన మహిళల 60మీటర్ల హర్డిల్స్ రేసును 8.12 సెకన్లలో పూర్తి చేసి సరికొత్త రికార్డుతో పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ క్రమంలో ఆసియాగేమ్స్(2022)లో 100మీటర్ల హర్డిల్స్‌లో 8.13సెకన్ల టైమింగ్‌తో తన పేరిటే ఉన్న జాతీయ రికార్డును తాజాగా జ్యోతి అధిగమించింది. అంతకుముందు జరిగిన హీట్స్‌లో ఆకట్టుకున్న ఈ ఆంధ్రప్రదేశ్ యువ అథ్లెట్ ఫైనల్లో ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ స్వర్ణం ఖాతాలో వేసుకుంది. అసుకా టెరెడా(8.21సె), లుయిలా యు(8.26సె) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. గతేడాది బ్యాంకాక్‌లో జరిగిన ఏషియన్ ఇండోర్ చాంపియన్‌షిప్‌లోనూ జ్యోతి పోడియం ఫినిష్‌తో ఆకట్టుకుంది.

బ్లాక్‌హాక్స్‌కు నిరాశ

చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్(పీవీఎల్)లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్‌కు నిరాశ ఎదురైంది. శనివారం జరిగిన తమ తొలి లీగ్‌మ్యాచ్‌లో బ్లాక్‌హాక్స్ 14-16, 11-15, 7-15తో చెన్నై బ్లిట్జ్ చేతిలో ఓటమిపాలైంది. మొదటి మ్యాచ్‌లో ఓడిన చెన్నై మలి పోరులో అద్భుతంగా పుంజుకుంది. ముఖ్యంగా అఖిన్, లియాండ్రో జోస్..బ్లాక్‌హాక్స్ పాయింట్లను బ్లాక్ చేశారు. కెప్టెన్ రంజిత్‌సింగ్ పాస్‌లతో ఆకట్టుకోగా హైదరాబాద్ పుంజుకునే ప్రయత్నం చేసింది.

తనయ్ పాంచ్ పటాకా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియం వేదికగా హైదరాబాద్, మేఘాలయ మధ్య రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ ఫైనల్ ఆసక్తికరంగా సాగుతున్నది. తనయ్ త్యాగరాజన్(5/103) ధాటికి మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 304 పరుగులకు ఆలౌటైంది. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 25/2 స్కోరు చేసింది.

భారత్ గెలుపు

బుసాన్(కొరియా): ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో భారత్ అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. శనివారం జరిగిన తొలి పోరులో భారత పురుషుల టీమ్ 3-0తో చిలీపై విజయం సాధించింది. దిగ్గజ ప్యాడ్లర్ శరత్ కమల్ 11-5, 11-8, 11-6తో నికోలస్ బుర్గోస్‌పై గెలిచాడు. హర్మీత్‌దేశాయ్ 11-8, 11-7, 11-6తో గుస్తావో గోమెజ్‌పై గెలిచాడు.

నోవార్టిస్ ఇండియాలో రెడ్డీస్‌కు వాటా!

మెజార్టీ వాటా కొనుగోలు యత్నాల్లో హైదరాబాదీ సంస్థ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: అంతర్జాతీయ ఫార్మా దిగ్గజం నోవార్టిస్ ఏజీ.. భారత్‌లో తన వ్యాపారాన్ని పూర్తిగా వదిలించుకోవాలని చూస్తున్నది. దీంతో ఇక్కడి సంస్థలో మెజార్టీ వాటాను విక్రయించడానికి సిద్ధమైంది. నోవార్టిస్ ఇండియాలో తనకున్న 70.68 శాతం వాటాను విక్రయించనున్నట్లు ప్రకటించిన మరుక్షణమే దేశీయ సంస్థలు ఈ వాటాను చేజిక్కించుకోవడానికి ప్రయత్నాలను ముమ్మరం చేశాయి. ఇప్పటికే పలు సంస్థలు ఆసక్తి చూపగా.. తాజాగా ఈ జాబితాలోకి హైదరాబాదీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ రేస్‌లోకి వచ్చింది. నోవార్టిస్‌కు చెందిన దేశీయ వ్యాపారాన్ని కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నట్లు రెడ్డీస్ వర్గాలు సూచనప్రాయంగా తెలిపారు. ఔషధాల పరిధిని మరింత విస్తరించడానికి, ప్రీమియం సెగ్మెంట్ వాటాను పెంచుకోవాలనే ఉద్దేశంతో సంస్థ ఉన్నది. నోవార్టిస్‌కు భారత్‌లో 8,100 మంది ఉద్యోగులు ఉన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.378.7 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. భారత్‌లో నోవార్టిస్ గ్రూపు..నోవార్టిస్ ఇండియా లిమిటెడ్, నోవార్టిస్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సర్వీసులు అందిస్తున్నది.

ఎల్ఐసీ అమృత్‌బాల్ పాలసీని మార్కెట్లోకి విడుదల చేస్తున్న కేంద్ర ఆర్థిక సేవల కార్యదర్శి వివేక్ జోషి. చిత్రంలో ఎల్ఐసీ చైర్‌పర్సన్ సిద్ధార్థ మొహంతి, ఇతర ఉన్నతాధికారులు

పిల్లలకు ఎల్ఐసీ అమృత్‌బాల్

ముంబై, ఫిబ్రవరి 17: ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ).. పిల్లల కోసం 'అమృత్‌బాల్' పేరిట ఓ సరికొత్త పాలసీని పరిచయం చేసింది. ఇదో వ్యక్తిగత, సేవింగ్స్, జీవిత బీమా, నాన్-లింక్డ్, నాన్-పార్టిసిపేటింగ్ ప్లాన్. పిల్లల ఉన్నత విద్య, ఇతర అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ పాలసీని రూపొందించారు. ఏజెంట్లు, ఇతర మధ్యవర్తుల ద్వారా దీన్ని కొనవచ్చు. సంస్థ అధికారిక వెబ్‌సైట్ www.licindia.in ద్వారా ఆన్‌లైన్‌లోనూ కొనుక్కోవచ్చు.

- 30 రోజులు-13 ఏండ్ల పిల్లలు అర్హులు.
- మెచ్యూరిటీ కనీస వయస్సు 18 ఏండ్లు. గరిష్ఠం 25 సంవత్సరాలు.
- షార్ట్ ప్రీమియం పేమెంట్ టర్మ్ 5, 6 లేదా 7 ఏండ్లు.
- కనీస పాలసీ టర్మ్ కోసం లిమిటెడ్ ప్రీమియం పేమెంట్ 10 ఏండ్లు. సింగిల్ ప్రీమియం పేమెంట్ కోసం 5 ఏండ్లు.
- గరిష్ఠ పాలసీ టర్మ్ కోసం లిమిటెడ్/సింగిల్ ప్రీమియం పేమెంట్ 25 ఏండ్లు. పీవోఎస్పీ-ఎల్ఐ/సీపీఎస్‌సీ-ఎస్పీవీ ద్వారా పొందే పాలసీలకు 20 ఏండ్లు.
- మినిమం సమ్ అష్యూర్డ్ రూ.2 లక్షలు. గరిష్ఠ బేసిక్ సమ్ అష్యూర్డ్ కోసం పరిమితి లేదు (షరతులు వర్తిస్తాయి).
- షరతులకు లోబడి పాలసీ వ్యవధిలో రుణ సదుపాయం లభిస్తుంది.
- అర్హత నిబంధనలకు లోబడి అదనపు ప్రీమియం చెల్లిస్తే ఎల్ఐసీ ప్రీమియం వైవర్ బెనిఫిట్ రైడర్ సదుపాయం.
- హై బేసిక్ సమ్ అష్యూర్డ్, ఆన్‌లైన్ సేల్ కింద పూర్తయిన ప్రతిపాదనకు రిబేటు.
- మెచ్యూరిటీ మొత్తాన్ని పొందేందుకు 5, 10 లేదా 15 ఏండ్ల వాయిదాల్లో సెటిల్మెంట్ ఆప్షన్లు.
- మెచ్యూరిటీ తేదీ, మెచ్యూరిటీ సమ్ అష్యూర్డ్‌లపై పాలసీ వ్యవధిలో గ్యారంటీడ్ అడిషన్స్.

టీ హబ్‌లో ఓపెన్ ఇన్నోవేషన్ చాలెంజ్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): అపోలో టైర్స్‌తో కలిసి ఓపెన్ ఇన్నోవేషన్ చాలెంజ్‌ను నిర్వహిస్తున్నామని టీ హబ్ ప్రతినిధి తెలిపారు. వరల్డ్ లీడింగ్ డిజిటల్ ఇన్నోవేషన్ సెంటర్‌తో కలిసి సాటర్న్ ఎఫ్1 పేరుతో ఈ చాలెంజ్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. డిజైన్ థింకింగ్, కృత్రిమ మేధస్సు, డిజిటల్ ట్విన్, ఐవోటీ, ఆర్‌పీఏ, ఏఆర్, వీఆర్ వంటి టెక్నాలజీ స్టార్టప్ కార్యకలాపాలను నిర్వహించే వారిని ప్రోత్సహించడమే లక్ష్యం. వివరాలకు https://bit.ly/4brxj84 సంప్రదించాలి.

వాణిజ్య

దేశంలో ఎన్ని రకాల బ్యాంకులున్నాయో తెలుసా!



షెడ్యూల్డ్, నాన్-షెడ్యూల్డ్ బ్యాంకులేవి? పేమెంట్స్-స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల మధ్య తేడాలేంటి?

దేశంలో ఉన్న రకరకాల బ్యాంకులు.. భారతీయ మిశ్రమ ఆర్థిక వ్యవస్థకు అద్దం పడుతాయి. దేశ ఎకానమీలో బ్యాంకులదే కీలకపాత్ర. నగదు డిపాజిట్లను తీసుకోవడానికి, రుణాలు ఇవ్వడానికి వీటికి లైసెన్స్ ఉంటుంది. ఇలా బ్యాంకులు దేశ ప్రగతికి, అభివృద్ధికి, ఆర్థిక సుస్థిరతకు, నూతన వ్యాపారాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. మన దేశంలో ఈ బ్యాంకింగ్ వ్యవస్థను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నియంత్రిస్తున్నది.

ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నిత్యం మనం బ్యాంకులపై ఆధారపడుతూనే ఉంటాం. మన దగ్గరున్న నగదును డిపాజిట్ల రూపంలో తీసుకునే బ్యాంకులు.. మన అవసరాల కోసం రుణాలనూ అందిస్తాయి. సేవింగ్స్, కరెంట్ ఖాతాల్లో నగదును దాచుకోవచ్చు. ఉద్యోగులకు జీరో బ్యాలెన్స్ అకౌంట్లుంటున్నాయి. బంగారం, ఇతర విలువైన నగలు, పత్రాలను లాకర్లలో భద్రపర్చుకోవచ్చు. సురక్షితమైన డిపాజిట్లకు వీలుంటుంది. వీటిపై వడ్డీని కూడా పొందవచ్చు. తక్కువ వడ్డీరేటుకే వ్యక్తిగత, గృహ, వాహన, వ్యాపార, విద్య, గోల్డ్ తదితర రుణాలనూ అందిస్తాయి. ముఖ్యంగా ఏటీఎంల ద్వారా నిరంతరం నగదును అందుబాటులో ఉంచుతాయి. డెబిట్, క్రెడిట్ కార్డులను జారీ చేస్తాయి. మరెన్నో లావాదేవీలు జరుపుతుంటాయి. ఫారిన్ ఎక్స్చేంజ్‌తో డీల్స్, వ్యవస్థలో ద్రవ్య సరఫరా, నియంత్రణ బాధ్యతలుంటాయి.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

భారతీయ కేంద్ర బ్యాంకే.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. దేశీయ బ్యాంకింగ్ వ్యవస్థను పర్యవేక్షించడం, రెపో-రివర్స్ రెపో వడ్డీరేట్లను సవరిస్తూ నియంత్రించడం, తగు మార్గదర్శకాలను రూపొందించడం ఆర్బీఐ ప్రధాన విధులు. కొత్త బ్యాంకులకు లైసెన్సులు మంజూరు చేయడం, నిబంధనల్ని ఉల్లంఘించిన వాటిపై చర్యలు తీసుకోవడం కూడా ఆర్బీఐ చేస్తుంది. ప్రతీ రెండు నెలలకోసారి ద్రవ్యపరపతి విధాన సమీక్షల్ని చేపట్టి వివిధ సాధనాల ద్వారా బ్యాంకింగ్ సిస్టమ్‌లోని నగదు సరఫరాను క్రమబద్ధీకరిస్తుంది. ఇక బ్యాంకుల్లో ఏయే రకాలున్నాయంటే..

షెడ్యూల్డ్ బ్యాంకులు

కమర్షియల్ బ్యాంకులే షెడ్యూల్డ్ బ్యాంకులు. ఇవి ఆర్బీఐ నియంత్రణలో పనిచేస్తాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934లోని రెండో షెడ్యూల్‌లో వీటి ప్రస్తావన ఉన్నది. ఇక షెడ్యూల్డ్ బ్యాంకులను ప్రధానంగా మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి ప్రభుత్వ బ్యాంకులు, ప్రైవేట్ బ్యాంకులు, విదేశీ బ్యాంకులు. డిపాజిట్లను సేకరించడం, రుణాలను ఇవ్వడంతోపాటు ఖాతాల ద్వారా వివిధ రకాల సేవల్ని అందిస్తాయి. ఇందుకు చార్జీలనూ వసూలు చేస్తాయి. విస్తృత శ్రేణిలో ఆర్థిక సేవలు, కార్పొరేట్ బ్యాంకింగ్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్, రిటైల్ బ్యాంకింగ్ సర్వీసుల్ని కల్పిస్తాయి. భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రభుత్వ రంగ బ్యాంకులే కీలకం.

నాన్-షెడ్యూల్డ్ బ్యాంకులు

నాన్-షెడ్యూల్డ్ బ్యాంకులు ఆర్బీఐ నియంత్రణలో ఉండవు. సాధారణంగా ఇవి చిన్న బ్యాంకులు. రిజర్వ్ క్యాపిటల్ రూ.5 లక్షల లోపే ఉంటుంది. వ్యక్తులు, వ్యాపార సంస్థలకు రుణాలను అందిస్తాయి. ఇవన్నీ కూడా ప్రైవేట్ సంస్థలే. ఇప్పుడు దేశవ్యాప్తంగా దిరుపతి కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, హిందుస్థాన్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ తదితర ఎన్నో నాన్-షెడ్యూల్డ్ బ్యాంకులు అందుబాటులో ఉన్నాయి.

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు

ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (ఆర్ఆర్‌బీ) 1975లో ఏర్పాటయ్యాయి. గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవలను అందించాలనే లక్ష్యంతో ఇవి పనిచేస్తాయి. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఎస్బీఐ తదితర కమర్షియల్ బ్యాంకులు వీటికి స్పాన్సర్లుగా వ్యవహరిస్తుంటాయి. గ్రామీణాభివృద్ధిలో వీటి పాత్ర ఎంతో కీలకం. ప్రస్తుతం దేశంలో 43 ఆర్ఆర్‌బీలున్నాయి. వీటిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బ్యాంకులూ ఉన్నాయి.

సహకార బ్యాంకులు

వీటిలో ప్రధానంగా పట్టణ, గ్రామీణ సహకార (కోఆపరేటివ్) బ్యాంకులున్నాయి. ఆర్థిక సేవల శాఖ వివరాల ప్రకారం దేశంలో 1,886 సహకార బ్యాంకులున్నాయి. 1,500 అర్బన్, 386 రూరల్ కోఆపరేటివ్ బ్యాంకులు. రూరల్ కోఆపరేటివ్ బ్యాంకుల్లో 34 రాష్ట్ర సహకార బ్యాంకులు, 352 జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు. సేవింగ్స్ ఖాతాలు, ముఖ్యంగా వ్యవసాయ రుణాలను అందిస్తున్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో వీటిది విడదీయరాని బంధమే.

లోకల్ ఏరియా బ్యాంకులు

2013లో లోకల్ ఏరియా బ్యాంకులు వచ్చాయి. కమర్షియల్ బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వం వీటికి స్పాన్సర్లుగా ఉంటాయి.

స్పెషలైజ్డ్ బ్యాంకులు

ఆర్థిక వ్యవస్థలో నిర్దేశిత రంగాలనుద్దేశించి ఈ బ్యాంకులు ఏర్పాటవుతాయి. వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల కోసమే ప్రత్యేకంగా వీటిని తీసుకొస్తారు. నాబార్డు, ఐడీబీఐ బ్యాంకులు ఈ కోవకు చెందినవే.

- ప్రస్తుతం దేశంలో ఎస్బీఐ, పీఎన్‌బీ, బీవోబీ తదితర మొత్తం 12 ప్రభుత్వ రంగ బ్యాంకులున్నాయి.
- 21 ప్రైవేట్ రంగ బ్యాంకులున్నాయి. వాటిలో హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ, కొటక్, యాక్సిస్ వంటివి ఉన్నాయి.
- దేశంలో 43 విదేశీ బ్యాంకులున్నాయి. వీటిలో హెచ్ఎస్‌బీసీ, సిటీ, డ్యూషే, డీబీఎస్, స్టాండర్డ్ చార్టెడ్, ఆర్బీఎస్ తదితర బ్యాంకులున్నాయి.
- కమర్షియల్ బ్యాంకుల ఏర్పాటుకు రూ.500 కోట్ల పెట్టుబడి ఉండాలి.
- స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల ఏర్పాటుకు రూ.200 కోట్ల మూలధనం అవసరం.
- పేమెంట్స్ బ్యాంక్ ఏర్పాటుకు రూ.100 కోట్ల క్యాపిటల్ కావాలి.

పేమెంట్స్ బ్యాంకులు

2015లో పేమెంట్స్ బ్యాంకులు మొదలయ్యాయి. ఇవి సేవింగ్స్ ఖాతాలు, నగదు బదిలీలు, బిల్ పేమెంట్లు వంటి కనీస బ్యాంకింగ్ సేవల్ని కస్టమర్లకు అందిస్తున్నాయి. అయితే రుణాలను మంజూరు చేయవు. క్రెడిట్ కార్డులనూ ఇవ్వవు. ప్రధానంగా నగదురహిత లావాదేవీలను ప్రోత్సహించడానికి వీటిని తీసుకొస్తున్నారు. ప్రస్తుతం 6 పేమెంట్స్ బ్యాంకులున్నాయి. వీటిలో ఎయిర్‌టెల్, ఇండియా పోస్ట్, ఫినో, పేటీఎం, జియో, ఎన్ఎస్‌డీఎల్ పేమెంట్స్ బ్యాంకులున్నాయి. ఆర్బీఐ పర్యవేక్షణలోనే ఇవి పనిచేస్తాయి.

స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు

స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు 2015 నుంచి ఆర్బీఐ లైసెన్సుల్ని ఇస్తున్నది. చిరు వ్యాపారులు, రైతులే లక్ష్యంగా వీటి బ్యాంకింగ్ కార్యకలాపాలు ప్రధానంగా సాగుతాయి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) సంస్థలకు, అసంఘటిత రంగ పరిశ్రమలకూ ఆర్థిక చేయూతనందిస్తాయి. సేవింగ్స్ ఖాతాలతోపాటు రుణాలు, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సౌకర్యాన్ని కస్టమర్లకు అందిస్తాయి. ప్రస్తుతం 12 స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులున్నాయి. వాటిలో ఏయూ, ఈక్వి